## క్లుప్తంగా

### విధులు సక్రమంగా నిర్వర్తించండి



రాయలసీమ రేంజ్ కమాండెంట్ మహేష్ కుమార్‌ను ఆహ్వానిస్తున్న దృశ్యం

**ఆదోనిఅర్బన్ :** సమస్యల పరిష్కారం నిమిత్తం పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలు, బాధితులకు న్యాయం చేయాలని, అలాగే విధి నిర్వహణలో నిబద్ధతతో మెలగాలని రాయలసీమ రేంజ్ కమాండెంట్ మహేష్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక సనా ఫంక్షన్ హాల్‌లో హెడ్ కానిస్టేబుల్, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇందుకు కమాండెంట్, ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి పాల్గొన్నారు. రైల్వే పోలీస్‌స్టేషన్ హోంగార్డు ఖాద్రి ముగ్గురు రైల్వే ప్రయాణికుల ప్రాణాలను కాపాడినందుకు ఆయనను అభినందించారు. వారు మాట్లాడుతూ సమస్యలు ఉంటే తెలియజేయాలని హోంగార్డులు, హెడ్ కానిస్టేబుళ్లను కోరారు. త్రీటౌన్, తాలూకా సీఐలు నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఆదోనిఅర్బన్ :** పట్టణంలోని రాంజల సబ్‌స్టేషన్‌లో ఇంప్రూమెంట్ వర్క్ జరుగుతున్నాయని, దీంతో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీ1 ఏఈ నాగభూషణం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అరుంజ్యోతినగర్, పెద్దమాదిగేరి, కూనిమొల్లా, ఎన్‌జీవోస్ కాలనీ, ఎల్‌ఐసీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ, టిలికం నగర్, పోస్టల్ కాలనీ, తాలూకా పోలీస్‌స్టేషన్ ఏరియా,రాంజల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ,వినియోగదారులు సహకరించాలని కోరారు.

### గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**ఆదోని సెంట్రల్:** మంత్రాలయం యార్డ్ కిలోమీటర్ నంబర్ 534/30-34 వద్ద గుర్తు తెలియని వ్యక్తి శనివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ కె. గోపాల్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పాలాల వైపు నుంచి వచ్చి లాతూర్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందని, రైలు కింద పడటంతో తల మొండెం విడిపోయాయని చెప్పారు. మృతుడు షర్ట్, ప్యాంట్ ధరించాడని, చేతికి ఫాస్ట్ ట్రాక్ కంపెనీ వాచ్ ఉందని పేర్కొన్నారు. ఆదోని డిప్యూటీ ఎస్ఎంఆర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. తెలిసిన వారుంటే వివరాలను రైల్వే పోలీసులకు అందజేయాలని కోరారు.

### మధ్యాహ్నంలో మెనూ పాటించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**కౌతాళం:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం సూచించిన మెనూ పాటించాలని ఎంపీడీఓ సుబ్బారాజు సూచించారు. శనివారం మండలంలోని ఏరిగేరి ఎంపీపీఎస్ (డీపెప్) పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయుల హాజరు పట్టిక పరిశీలించి పాఠశాల వివరాలు, మధ్యాహ్న భోజన మెనూను హెచ్ఎం ఆంధ్రయ్యను అడిగి తెలుసుకున్నారు. సర్వశిక్ష అభియాన్ ఏఈ శివశంకర్‌తో కలిసి నాడు-నేడు ఫేస్-2 పథకం కింద పాఠశాలలో చేపడుతున్నట్లు పనులను పరిశీలించారు. పనులలో నాణ్యతను తప్పక పాటించాలని ఆదేశించారు.

### శ్రీమఠంలో హైకోర్టు న్యాయమూర్తి



మొక్కులు తీర్చుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

**మంత్రాలయం:** రాఘవేంద్రస్వామి దర్శనార్థం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా మంత్రాలయం విచ్చేశారు. శనివారం రాత్రి కర్నూలు జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావుతో కలిసి ఇక్కడికి చేరుకున్నారు. మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు న్యాయమూర్తులకు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పూల, మంత్రాక్షింతలతో ఆశీర్వాదం చేశారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు ఆహ్వానం పలికారు.



ఈ ఫొటోలో కుట్టుమిషన్ యూనిట్ ఏర్పాటు చేసుకున్న మహిళ పేరు శైలజ. ఆదోని పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీలో నివాసముంటుంది. ఎస్‌హెచ్‌సీ పొదుపు సంఘం సభ్యురాలిగా ఉంటూ ప్రభుత్వ సహకారంతో రూ.1.50లక్షలు రుణంగా తీసుకుంది. ఈ మొత్తానికి తన వద్దనున్న కొంత మొత్తంతో పాటు వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి కింద వచ్చిన సొమ్ము కలుపుకొని ఏడు కుట్టుమిషన్లు, జిగ్‌జాగ్ మిషన్, గుండీలు వేసే మిషన్ తదితర వాటిని ఏర్పాటు చేసుకుంది. ఈమె తనతో పాటు మరో ఐదుగురికి ఉపాధి చూపుతోంది. ముడి సరుకులు, కూలీల జీతాలు పోనూ నెలకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు మిగులుతుందని, తన భర్త జేమ్స్ ఫర్నీచర్ వర్క్ చేస్తున్నాడని, వచ్చిన డబ్బులతో పిల్లలను చదివించుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నానని ఆమె చెబుతోంది.



ఇక్కడ చీరల వ్యాపారం చేస్తున్న మహిళ పేరు నిర్మల. ఆదోని పట్టణంలోని కిలిచిన్ పేటలో నివాసం ఉంటున్నారు. భర్త మెడికల్ షాపు నడుపుతుండగా.. తాను ఎస్‌హెచ్‌జీ పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉంటూ రూ.లక్ష రుణం తీసుకుంది. దీనికి తోడు.. జగనన్న తోడు, అమ్మ ఒడి తదితర పథకాల సొమ్ముతో ఇంటి ముందు చిన్న బంకు ఏర్పాటు చేసుకొని సొంతంగా చీరల వ్యాపారం చేసుకుంటోంది. వ్యాపారం సీజన్ వారీగా ఉంటుందని, అయినా ఫర్వాలేదంటోంది. ఇలా వచ్చిన సొమ్ముతో ముగ్గురు పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెబుతోంది.

# అభివృద్ధి పథంలో అతివలు

- ప్రభుత్వ పథకాల సొమ్ముతో ఉపాధిని మెరుగు పరుచుకుంటున్న మహిళలు
- సర్కారు సహకారంతో రుణాలు పొంది సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వైనం
- తమతో పాటు మరికొందరికి ఉపాధి చూపుతున్న స్త్రీలు



ఆదోనిలో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటున్న సైరాబాను

**ఆదోని సెంట్రల్:** మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. వివిధ పథకాలు ద్వారా వారికి చేయుతనిచ్చి అభ్యున్నతి సాధించేలా ప్రోత్సహిస్తుండటంతో పలువురు మహిళలు సొంతంగా వ్యాపారాలు నిర్వహించుకుంటూ తమతో పాటు మరికొందరికి ఉపాధి చూపుతున్నారు. పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉంటూ బ్యాంక్‌ల నుంచి రుణం తీసుకొని, అలాగే వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందజేసిన సొమ్మును జమ చేసుకొని వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకొని, జీనవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటూ తమకుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

**పథకాలతో అండగా ప్రభుత్వం..**

ఆదోని పట్టణంలో 3,300 , గ్రామీణ ప్రాంతంలో 2,265 పొదుపు సంఘాలు ఉన్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే మహిళలకు జగనన్నతోడు పథకం కింద ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున పట్టణంలోని 2500 మందికి రూ.2.50 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. గ్రామీణ ప్రాంతంలోని 750 మందికి రూ.7.50 కోట్లు అందజేసింది. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల గ్రూపులకు ప్రభుత్వం సున్నా వడ్డీ నిధులను చెల్లిస్తోంది. ఇందుకు గ్రామీణ ప్రాంతంలోని 2,037 పొదుపు సంఘాలకు రూ.2.30 కోట్లు, పట్టణంలో 2,463 పొదుపు సంఘాలకు రూ.3.37 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద గతంలో తీసుకున్న రుణాలను నాలుగు విడతలో మాఫీ చేస్తుంది.

**బ్యాంక్ లింకేజీ రుణాల ద్వారా..**

బ్యాంకు లింకేజీ ద్వారా పొదుపు సంఘాల సభ్యులకు వైఎస్సార్ క్రాంతి పథం కింద ప్రభుత్వం రుణాలు ఇప్పిస్తోంది. గ్రామీణ ప్రాంతంలోని 230 పొదుపు సంఘాలకు రూ.13కోట్లు రుణాలను ఇప్పించారు. పట్టణంలోని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకొంటున్న మహిళలకు మెప్మా సిబ్బంది బ్యాంకులతో మాట్లాడి ఒక్కో మహిళకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు రుణాలు ఇప్పించారు. ఇలా పట్టణంలో దాదపు 3,155 మందికి రుణాలు మంజూరు చేయించారు. ప్రభుత్వం చేయూత పథకం కింది 45 – 60 ఏళ్లు నిండిన మహిళకు రూ.18,500 అందజేస్తుంది.

**వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలు**

మహిళలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత నందిస్తుండడంతో సొంతంగా వ్యాపారాలు పెట్టుకొని రాణిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న తోడు వంటి పథకాలు వారికి ఎంతోగానో తోడ్పడుతున్నాయి. ఎంతో మంది చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. కిరాణా దుకాణాలు, చీరల వ్యాపారం, కుట్టు మిషన్లు ఏర్పాటు, అగరబత్తి, అప్పడాలు వంటివి తయారు చేసి మార్కెట్‌లో అంగళ్లకు పంపిణీ చేసి సంపాదిస్తున్నారు.

**పథకాల సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతోంది**



ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ, జగనన్న తోడు వంటి పథకాల సొమ్ము మాకు ఎంతగానో తోడ్పాటు నందిస్తున్నాయి. గతంలో చిన్న వ్యాపారం ఏర్పాటు చేసుకోవడానికి అప్పు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వ పథకాల సొమ్ముతో పాటు పొదుపు సంఘం కింద వచ్చిన బ్యాంక్ రుణంతో కిరాణా దుకాణం ఏర్పాటుకు పెట్టుబడి పెట్టాం. వ్యాపారం ద్వారా మా జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి.

– ఖైరున్నీసా, ఆదోని

**ప్రభుత్వం అండగా నిలుస్తోంది**



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్థికంగా చేయుతనందిస్తోంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా ప్రభుత్వం సున్నావడ్డీ నిధులను విడుదల చేసింది.పొదుపు సంఘాల సభ్యులు కూడా రుణాలను సకాలంలో చెల్లించడానికి అలవాటు పడ్డారు. బ్యాంకులు కూడా తీసుకున్న రుణాల కంటే అధికంగా ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు వంటి పథాలు వల్ల పొదుపు సంఘాల్లోని సభ్యులు చాలా మంది లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వం అందించిన సొమ్మును సద్వినియోగం చేసుకుంటే తమ కుటుంబాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చు.

– సమీనా, మెప్మా సీఎంఎం

### పెద్దపెండేకల్ కొండల్లో చిరుతపులి



కొండలో చిరుత పులి సంచరిస్తున్న దృశ్యం

**ఆదోనిరూరల్:** మండలంలోని పెద్దపెండేకల్ గ్రామ కొండల్లో చిరుతపులి సంచరిస్తోంది. దీంతో చుట్టుపక్కల గ్రామస్తులు, రైతులు భయాందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో గ్రామస్తులు పొలాల్లో పనులు చేసుకునేందుకు జంకుతున్నారు. ఎప్పుడు చిరుతపులి వచ్చి తమపై దాడి చేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ రేంజర్ ఆఫీసర్ తేజస్విని మాట్లాడుతూ.. చిరుతపులి సంచార విషయం తమదృష్టికి రాలేదన్నారు. విచారించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

**మంత్రాలయం:** తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ తమ కుటుంబాన్ని సీఎం జగనన్న ఎంతగానో ఆదరిస్తున్నారని చెప్పారు. మా ఇంట్లో నలుగురు తమ్ముళ్ల ఇప్పటికే చట్టసభల్లో ఉన్నారని, ముగ్గురికి ఎమ్మెల్యేలుగా చేశారని, తనను టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. సీతారామిరెడ్డిని ఉరకుంద ఈరన్న స్వామి ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు, అధికారులు, అర్చకులు స్వామి శేషవస్త్రం, ప్రసాదం, ఫలాలతో సత్కరించారు. అలాగే పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు.

### బోరు, వాటర్ ట్యాంకు ఏర్పాటు

**ఆదోనిఅర్బన్ :** పట్టణంలోని న్యూ గాంధీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహ వ్యవస్థాపక కమిటీ ఆధ్వర్యంలో శనివారం కాలనీలో చెడిపోయిన మున్సిపాలిటీ బోరుకు మరమ్మతులు చేయించి, మోటార్ బిగించి నీటిని సరఫరా చేయించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కమిటీ ఆధ్వర్యంలో రూ.60 వేలు ఖర్చు చేసి బోరు ఏర్పాటు చేసి మినీ ట్యాంకుకు నీటిని సరఫరా చేయించామన్నారు.

## ఉరుకుందలో భక్తుల సందడి





స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**కౌతాళం:** శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ శనివారం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధికంగా తరలివడంతో క్షేత్రంలో సందడి నెలకుంది. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శనాల ద్వారా పంపారు. తెల్లవారు జామున స్వామి వారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి నైవేద్యంగా సమర్పించారు.

## ఈరన్నస్వామికి బంగారు గొలుసు విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం



బంగారు గొలుసు అందజేస్తున్న దృశ్యం

**కౌతాళం:** ఉరుకుంద ఈరన్న స్వామి వారికి శనివారం ఓ భక్తుడు 13.1 గ్రాముల బంగారు గొలుసు విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. రాయచూరుకు చెందిన నారాయణ నాయక్, వెంకమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు 13.1 గ్రాముల బంగారు గొలుసును దేవాలయ కార్యాలయంలో అందజేశారని చెప్పారు. అలాగే.. రాజగోపుర నిర్మాణానికి ఎమ్మిగనూరుకు చెందిన డి. సత్యనారాయణస్వామి కుటుంబ సభ్యులు రూ.1,00,016, శాశ్వత నిత్యఅన్నదాన పథకానికి ఆదోనికి చెందిన మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులు రూ.25వేలు విరాళంగా అందజేశారని వివరించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదం, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

## వైభవంగా వీరభద్రుడి ఊరేగింపు



వీరభద్రుడి విగ్రహ ఊరేగింపులో పూర్ణకుంభాలు, కలశాలతో మహిళలు



ఊరేగింపు వేడుకలో వివిధ వేషధారణలో కళాకారులు

**మంత్రాలయం :** స్థానిక పాతూరులో పునర్నిర్మించిన ఆలయంలో నూతన వీరభద్రస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ నేథప్యంలో శనివారం వీరభద్రస్వామి విగ్రహాన్ని భక్తులు ఊరేగింపు చేపట్టారు. నూతన శిలా విగ్రహానికి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రత్యేక పూజలు గావించారు. వీరశైవ లింగాయతులు, గ్రామ మహిళలు పూర్ణకుంభాలు, వీరభద్రుడి వేషధారణ, కళాకారుల నృత్య ప్రదర్శనలు, పావుకోళ్ల సేవతో ఊరేగింపు వైభవంగా సాగింది.

## వరుణుడి కటాక్షం కోసం..

**మంత్రాలయం :** వానదేవుడు ముఖం చాటేయడంతో గ్రామీణులు ఏటి యాత్ర, గ్రామ దేవుళ్లకు జలాభిషేకాలు, సప్తభజనలు చేపట్టారు. శనివారం మండలంలోని చిలకలడోణ నుంచి 500 మంది, కల్లుదేవకుంట నుంచి 600 మంది నదిజలాలను తీసుకొచ్చేందుకు బయలుదేరారు. కాలినడకన మంత్రాలయంలోని తుంగభద్ర నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి జలాలతో ఊరేగింపుగా వెళ్లారు. నదీ జలాలతో గ్రామంలోని దేవుళ్లకు అభిషేకాలు గావించారు. ఊరేగింపుతో మంత్రాలయం క్షేత్ర దారులు రద్దీగా మారాయి.



తుంగభద్ర నది నుంచి పవిత్ర జలాన్ని తీసుకెళ్తున్న చిలకలదోణ గ్రామస్తులు

## రణమండల.. భక్తులతో కిటకిట



ప్రత్యేక అలంకరణలో రణమండల ఆంజనేయస్వామి



భక్తులతో కిటకిటలాడుతున్న కొండ

- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన రణమండల గిరులు
- భారీగా తరలివచ్చిన భక్తులు

**ఆదోనిఅర్బన్ :** పట్టణ శివారులోని రణమండల గిరులు శ్రీరామ నామస్మరణతో మారుమోగాయి. శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా రణమండల కొండపై వెలసిన ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు పట్టణంతోపాటు సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో కొండ ప్రాంతాలు, దారులు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు టీజీ పాండయ్యశెట్టి ఆధ్వర్యంలో వేకువజామున స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీ, వడల హారం, నైవేద్యం, మహామంగళ హారతితోపాలు వివిధ విశేష పూజలు చేపట్టారు.తెల్లవారుజామున 3 నుంచి ప్రారంభమైన దర్శనం రాత్రి 10 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కొండపై వెలసిన స్వామివారిని దర్శించుకొని ప్రకృతి ఒడిలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తులు పిండి వంటలు చేసుకొని ఆరగించారు.



కొండ పైకి వెళ్తున్న భక్తులు

### కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

**ఆదోని సెంట్రల్:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకులుగా, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని ఆర్‌యుఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కోరారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో ఆర్‌యుఎస్ఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చాలీ చాలని జీతాలతో కుటుంబాలను పోషించుకొంటున్నారని తెలిపారు. ఉద్యోగాలు లేక తక్కువ వేతనానికే పనిచేస్తున్నారని, వారిని రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు రవి, మునిస్వామి, హేమంత్, రాకేష్, వంశీ, రాఘవేంద్ర, వికాస్, మోజేష్ పాల్గొన్నారు.

### రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

**ఆదోనిరూరల్ :** పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలోని రోగులకు ఆర్ఎస్ఎస్ సేవాభారతి ఆధ్వర్యంలో శనివారం పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రమేష్, మనోహరయ్య, రఘు, వెంకటేష్, ఈరన్నరావు, గోవర్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఆరోగ్యమిత్ర కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### రైల్వే గేటును ఢీకొన్న ట్రాక్టర్

**కోసిగి:** మండల కేంద్రంలోని రైల్వే గేటును శనివారం సాయంకాలం ఓ ట్రాక్టర్ ఢీకొట్టడంతో విరిగిపోయింది. కోసిగి మీదుగా హాల్వి వైపు వెళ్తున్న ట్రాక్టర్ గేటు దాటుకుని వెళ్లాల్సి ఉంది. అదే సమయంలో రైలే రాక కోసం గేటు మెన్ గేటును వేసేందుకు సిద్ధమయ్యాడు. అయితే గేటు వేసేలోగా గేటు దాటి వెళ్లిపోతాననుకుని ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా దూసుకెళ్లాడు. అంతలోగా గేటు కిందకు రావడంతో ట్రాక్టర్ గేటును ఢీకొట్టింది. దీంతో గేటు విరిగిపోయింది. అప్రమత్తమైన గేట్‌మెన్ వాహనాలు ఎక్కడిక్కడే నిలిపి వేసి తాత్కాలిక గేటు వేశాడు. రైలు వెళ్లిపోయిన తరువాత ట్రాఫిక్ ఏర్పడింది. ఎస్ఐ సతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విరిగిన గేటు పరిశీలించారు. సిబ్బందితో కలిసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## అనుసరణీయం..మదర్ థెరిస్సా జీవితం



మదర్ థెరీస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కౌతాళం జూనియర్ కళశాలలో నివాళులర్పిస్తున్న దృశ్యం

**ఆదోని సెంట్రల్:** మానవతా వాదులకు మదర్ థెరీస్సా జీవితం అనుసణీయమని ఆర్ఆర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు పేర్కొన్నారు. శనివారం భారతరత్న మదర్ థెరీస్సా జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను కొనియాడారు.

**కౌతాళం:** సమాజ సేవకు ధన, జనబలం అవసరం లేదని మనుసుంటే చాలు అని నిరుపించిన మహోన్నత మాతృమూర్తి మదర్ థెరీస్సా అని, ఆమెను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ దూద్‌బాషా, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి సూచించారు. మదర్ థెరిస్సా జయంతి వేడుకలను శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**ఆదోని సెంట్రల్:** పట్టణంలోని జీవనజ్యోతి ఆశ్రమ నిర్వాకులు పాస్టర్ పిలిఫ్ మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని అనాథలు, వృద్ధులకు శనివారం పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అలాగే..రేల్వే స్టేషన్, బస్టాండ్ పట్టణ పరిసర ప్రాంతాల్లో నిరాశ్రయులకు పండ్లు, బెడ్లు అందజేశారు.

### పిల్లలను బడిలో చేర్పించాలి

**కోసిగి:** బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5 – 18 ఏళ్ల వరకు పిల్లలు డ్రాప్ అవుట్ అయి ఉంటే గుర్తించి పాఠశాలలో చేర్పించాలన్నారు. జిల్లాలోనే కోసిగి మండలం అక్షరాస్యతతో పాటు బడి ఈడు పిల్లలు ఎక్కువగా ఉన్నారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి బడి ఈడు పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పించాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఎంఈఓలు మెయినుద్దీన్, నాగేశప్ప, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.



కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న డీఈఓ రంగారెడ్డి